‘ఇంటింటికి’ మంగళం..!

- వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనాల రద్దు
- ఇప్పటికే ఆదేశాలు ఇచ్చిన పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల
- ఆదోని డివిజన్‌లో 163 వాహనాల నిలిపివేత
- మొదటికి రానున్న కార్డుదారుల ఇక్కట్లు


ఇంటి వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు (ఫైల్)

మంత్రాలయం : పడిగాపులు లేవు.. నెత్తిన మోత లేదు.. డీలర్ల సతాయింపు లేదు. నెలనెలా ఇంటి ముంగిటకే రేషన్ సరుకులు. వ్యయప్రయాసలకు తావులేకుండా ఇంటికి సరుకులు వచ్చేవి. ఇదంతా గతం.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కార్డుదారులకు కన్నీళ్లు తెప్పించేందుకు శ్రీకారం చుట్టింది. కార్డుదారులకు పాత ఇక్కట్లను చేరువ చేయనుంది. వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనాలకు బ్రేకులు వేసి పారదర్శకానికి పాతర వేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ఇటు ఎండీయూ వాహన ఆపరేటర్లు, అటు కార్డుదారులు సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే ఎండీయూ వాహన ఆపరేటర్లు రోడ్డెక్కి నిరసన గళాన్ని వినిపిస్తున్నారు.

409 వాహనాలు నిలిపివేత

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రేషన్ సరుకులను పారదర్శకంగా అందించాలని, రేషన్ కోసం ప్రజలు పడిగాపులకు స్వస్తి పలకాలన్న సదుద్దేశంతో ఇంటింటి రేషన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఎండీయూ వాహనాలను ప్రవేశపెట్టి ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందజేసింది. 21.01.2021 నుంచి రాష్ట్రంలో ఈ విధానాన్ని అమలులోకి తెచ్చింది. జిల్లాలో 409 వాహనాల నుంచి రేషన్ సరుకులు సరఫరా చేసింది. అందులో ఆదోని రెవెన్యూ డివిజన్‌లో 163, పత్తికొండ డివిజన్‌లో 87, కర్నూలు డివిజల్‌లో 159 వాహనాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎండీయూ వాహనాలను రద్దు చేస్తూ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదేండ్ల మనోహర్ ప్రకటించడంతో మంత్రాలయం నియోజకవర్గంలో 48, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో 55, ఆదోనిలో 50 వాహనాలు ఆగిపోనున్నాయి. కోసిగిలో 13, మంత్రాలయంలో 11, కౌతాళంలో 14, పెద్దకడబూరులో 10 వాహనాలు రద్దు కానున్నాయి. ఈ వాహనాలన్నీ జూన్ 1వ తేదీ నుంచి కనుమరుగు కానున్నాయి.

ఆపరేటర్ల ఆందోళన

అప్పటి ప్రభుత్వం ఆపరేటర్ 10 శాతం, ప్రభుత్వం 90 శాతం నిధులు వెచ్చిస్తూ వాహనాలు కేటాయించింది. ఆపరేటర్ ప్రతి నెలా రూ.3 వేలు, ప్రభుత్వం రూ.5 వేలు చొప్పున వాహనాల కంతులు చెల్లించేలా నిర్ణయించింది. ఆపరేటర్లు 10 శాతం అంటే రూ.63,200 చెల్లించి వాహనాలను సొంతం చేసుకున్నారు. ప్రభుత్వం రేషన్ పంపిణీ, వాహన కంతుకు కలిపి నెలనెలా ఒక్కో ఆపరేటర్‌కు రూ.21 వేలు ఖాతాలో జమ చేసింది. ఆరేళ్ల కాలపరిమితిలో వాహనాల కంతులను నిర్ణయించారు. ఇంకా 18 నెలలు కంతులు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం ఉన్నపాటున వాహనాలను నిలిపివేసింది. అర్ధంతరంగా వాహనాలను నిలిపివేస్తే తామూ వాహనాల ఈఎంఐలు ఎలా కట్టుకోవాలని ప్రశ్నిస్తున్నారు. తమకు జీవనభృతి ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారు. తమ కుటుంబాలు రోడ్డు పడతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మళ్లీ రేషన్ కష్టాలు

కూటమి ప్రభుత్వం నిర్ణయంతో కార్డుదారులకు రేషన్ కష్టాలు మళ్లీ మొదటికి వచ్చాయి. రేషన్ డీలర్ల వద్దే సరుకులు తీసుకోవాలని ఆదేశాలు రావడంతో లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. గంటల తరబడి నిరీక్షించడంతోపాటు డీలర్లతో చీవాట్లు పడాల్సి వస్తుందని ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేవలం తమ డీలర్లను పెద్ద చేయాలన్న ఉద్దేశంతోనే ఇలాంటి నిర్ణయం పుట్టుకొచ్చిందని ఆరోపిస్తున్నారు. రేషన్ షాపులు లేని గ్రామస్తులు ఇతర ఊళ్లకు వెళ్లి రేషన్ తీసుకోవాలంటే ఎంతో వ్యయప్రయాసకోర్చాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం బాధాకరం



కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తొలగించడం బాధాకరం. ప్రజలకు ఎలాంటి అవస్థలు లేకుండా నేటి వరకు ఇంటి వద్దే సరుకులు తీసుకున్నాం. వాహనాలు రద్దు చేసి డీలర్లకు అప్పగించడం మంచి పద్ధతి కాదు. ఇలా చేయడంతో ఎంతో మంది పేదలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పనులు మానేసి సరుకుల కోసం పరుగులు తీయాల్సి వస్తుంది. ప్రభుత్వ పునరాలోచించాలి. – తాయమ్మ, నదిచాగి


తమ సమస్యలకు పరిష్కారం లేదు



ఎండీయూ వాహనాల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసుకున్నాం. వాహనాలపై ఇంకా 18 కంతులు మిగిలే ఉన్నాయి. కంతులు చెల్లించడానికి ప్రభుత్వం ఎలాంటి తోవ చూపించలేదు. వాహనాలను తాము కొనుగోలు చేయాలంటే ఖర్చుతో కూడుకున్న పని. ఉన్నపాటున వాహనాలను నిలిపివేస్తే తమ పరిస్థితి ఏంటో దిక్కుతోచడం లేదు. ఇప్పటికైనా తమ సమస్యలకు పరిష్కారం చూపాలి. – సురేష్‌స్వామి, సాతనూరు

క్లుప్తంగా

మంగరాయుడికి వెన్న అలంకారం



ఆదోని అర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయస్వామి శనివారం వెన్న అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ మేనేజ ర్ భీమసేన ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన ఏడు కేజీల వెన్నతో పూజారులు గురురాజ ఆచారి, గోపిలు స్వామి వారికి పంచామృతాభిషేకం, తేనాభిషేకం, వెన్నతో అలంకారం, తులసీహారం, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు.

వాయుపుత్రుడికి అభిషేక పూజలు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజినేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

కోసిగి చేరిన పాఠ్య పుస్తకాలు


పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శోభారాణి

కోసిగి: 2025–2026 విద్యా సంవత్సరానికి రెండవ విడుత పాఠ్యపుస్తకాలు శనివారం కోసిగికు వచ్చినట్లు ఎంఈఓ శోభారాణి తెలిపారు. మొదటి విడతగా మండలానికి 44 వేల పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. రెండవ విడుతగా 22,400 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు చెప్పారు. వచ్చిన పాఠ్యపుస్తకాలను కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలోని అదనపు గదులలో భద్రపరిచినట్లు తెలిపారు. పాఠశాలలు తెరిచే నాటికి పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమక్షంలో వివిధ పాఠశాలలకు చేరుస్తున్నట్లు ఆమె తెలిపారు.

గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్


విద్యార్థులతో పుస్తక పఠనం చేయిస్తున్న గ్రంథాలయ అధికారి దుల్లయ్య

కోసిగి: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని జనరల్ నాలెడ్జ్, పుస్తక పఠనం మెరుగు పరుచుకోవాలని గ్రంథాలయ అధికారి దుల్లయ్య అన్నారు. శనివారం స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు గ్రంథాలయ పరిజ్ఞానం పై అవగాహన కల్పించారు. వేసవి సెలవుల్లో సమయం వృథా చేసుకోకుండా గ్రంథాలయంకు వచ్చి పాఠ్య పుస్తకాలు, నవలు, కథలు, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదువుకుని పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్, క్యారమ్ బోర్డు, చదరంగం, తదితర పోటీలు నిర్వహించారు.

పెట్రోల్ బంక్‌లు, పాల కేంద్రాల్లో తనిఖీలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పాల కేంద్రాలు, పెట్రోల్ బంక్‌లలో శనివారం వినియోగదారుల రక్షణ మండలి అధికారుల బృందం తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ పలు శాఖల అధికారుల బృందం పట్టణంలోని కర్నూలు రోడ్డులోని రెండు పెట్రోల్ బంక్‌లతో పాటు గాంధీనగర్‌లోని తిరుమల పాల డెయిరీ, బస్టాండ్ రోడ్డులోని మెడికల్ ల్యాబ్‌లో తనిఖీలు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతితో మరో తొమ్మిది ప్రభుత్వ శాఖల అధికారులు తనిఖీల్లో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


శ్రీదేవి ఎస్టేట్‌లో రోడ్డు పక్కనే కంచె లేకుండా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

ఆదోని సెంట్రల్: మండంలోని మండిగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని శాంతి ఎస్టేట్‌కు ఆనుకుని ఉన్న శ్రీదేవి ఎస్టేట్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయలేదు. శాంతి ఎస్టేట్ నుంచి తిరుమలనగర్‌కు పాదచారులు, వాహనదారులు తిరుగుతూ ఉంటారు. దీనికి తోడు ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాల్లో ఉన్న చిన్నారులు ఆడుకుంటూ ఉంటారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పేదల వైద్యానికి ప్రాధాన్యతనిచ్చిన జగనన్న

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో నిర్మితమైన వంద పడకల ఆస్పత్రి పరిశీలన


ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక పరికరాలను పరిశీలిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక

ఎమ్మిగనూరుటౌన్: పేద, బడుగు,బలహీన వర్గాల వారికి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అధిక ప్రాధాన్యతనిచ్చారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన రూ.12.60 కోట్ల నిధులతో 2020 సంవత్సరం ఏప్రిల్ 3వ తేదీన మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి భూమి పూజ చేసి పట్టణంలో వందపడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణాలను ప్రారంభించారు. ప్రస్తుతం నిర్మాణ పనులు పూర్తయిన వంద పడకల ఆస్పత్రి భవనాన్ని శనివారం పార్టీ శ్రేణులతో కలిసి ఆమె పరిశీలించారు. ఆస్పత్రిలో సమకూర్చిన అత్యాధునిక పరికరాలను, వార్డులను పరిశీలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో రోగులు, ప్రజలకు అందిస్తున్న సేవలను వైద్యాధికారిణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో నిర్మించిన వంద పడకల ఆస్పత్రి భవనం ప్రారంభం కావడం ఎంతో సంతోషంగా వుందని తెలిపారు. వందపడకల ఆస్పత్రిలో ఇంకా చేపట్టాల్సిన కొన్ని చిన్న చిన్న పనులు సత్వరం పూర్తి చేసి అన్ని సదుపాయాలను అందుబాటులోకి తేవాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. అలాగే నిపుణులైన వైద్యులను నియమించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే పూర్తి..

ఎన్నికల ముందే ఆస్పత్రి భవన సముదాయం నిర్మాణం పూర్తయ్యిందని, అయితే ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభోత్సవం చేయలేదని బుట్టా రేణుక తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం కేవలం శిలాఫలకాలకే పరిమితమైందే తప్ప నిధులు మాత్రం మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. ప్రజలను మభ్యపెట్టేందుకే హడావుడిగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం తరువాత వాటికి నిధులు కేటాయించకపోవడం టీడీపీ ప్రభుత్వ నైజమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, బుట్టా ప్రతుల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు కామర్తి నాగేషప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి మాచాని వెంకటేష్, జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్, పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి యూకే రాజశేఖర్, బీసీ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి విరుపాక్షిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పార్టీ నాయకులు కోటకొండ నరసింహులు, పేట శ్రీనివాసరెడ్డి, అల్తాఫ్, సయ్యద్‌చాంద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ


రవి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బుట్టారేణుక

గోనెగండ్ల మండల పరిధిలో చిన్నమరివీడు గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన రవి కుటుంబ సభ్యులను శనివారం పట్టణంలోని ఆస్పత్రి వద్ద వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక పరామర్శించారు. వారికి మనోధైర్యానిచ్చి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివనీలకంఠ, యూత్ నాయకుడు బుట్టా ప్రతుల్, నాయకులు కాశీవిశ్వనాథ్ రెడ్డి, పిల్లిగుండ్ల గోవిందు, పుట్టపాశం గంగాధర్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్య తీసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకుడు సాబీర్ డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో అక్రమ ఫీజుల రక్కసి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా బుక్స్, యునిఫాం, డొనేషన్లు తదితర ఫీజులంటూ నర్సరీకే రూ.30వేల నుంచి రూ.40వేల వరకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడిని అరికట్టండి

పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల పేరుతో ఆయా పాఠశాలలు దోపిడీ చేస్తున్నాయని ఆర్‌యూఎస్‌ఎఫ్, ఆర్‌పీఎస్‌ఎఫ్ నాయకులు షాహిద్ అఫ్రిది, రఘునాథ్ ఆరోపించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆయా పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎంపీహెచ్‌లో పెద్దకడబూరు యువతి ప్రతిభ


తేజస్విని

మంత్రాలయం : ప్రపంచంలోనే పేరెన్నిక ఐవీవై లీగ్ యూనివర్సిటీల్లో ఒక్కటైన న్యూయార్క్‌లోని కార్నెల్ యూనివర్సిటీ పెద్దకడబూరుకు చెందిన యువతి నాగమ్మగారి తేజస్విని ప్రతిభ కనబరిచింది. మాస్టర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్ కోర్సు (ఎంపీహెచ్) మొదటి ప్రయత్నంలోనే పూర్తి చేసుకుని వైద్య విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. పల్లెటూరిలో చదువుకుని ప్రపంచంలోని ఎనిమిది యూనివర్సిల్లో ఒక్కటైన కార్నెల్‌లో మూడేళ్లలో తన కోర్సు పూర్తి చేసుకుని శభాష్ అనిపించుకుంది. జిల్లాలో కోర్సు పూర్తిచేసుకున్న ఏకైన వ్యక్తిగా అసమాన ప్రతిభను చాటుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం


మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులను సన్మానిస్తున్న వ్యాపారులు

ఆదోని టౌన్: ప్రజా సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమని ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్ సి.హెచ్. లోకేశ్వరి అన్నారు. శనివారం చైర్‌పర్సన్ ఛాంబర్‌లో పలు వ్యాపార సంఘాలు, ప్రజా సంఘాలు చైర్‌పర్సన్ సి.హెచ్.లోకేశ్వరి, భర్త నాగరాజును ఘనంగా సన్మానించాయి. ఈ సందర్భంగా స్వీట్లు పంచిపెట్టారు. ఆమె మాట్లాడుతూ.. పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలను గుర్తించి విడతలవారీగా పరిష్కారం చేస్తానని చెప్పారు. తన పదవీకాలం ముగిసేలోపు ప్రజల అవసరమైన మేర సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. స్వకుళసాలె సంఘం నాయకులు సత్యకుమార్, వేణుగోపాల్, తాయప్ప, శ్రీనివాసులు, శంకర్, కిలిచినపేట అంబాభవానీ యూత్ నాయకులు బుజ్జి, విజయ్ కుమార్, సిద్ధిక్, సాకరే రమేష్, క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులు సాయిరాం, సిద్ధిక్, విజయ్, జునైద్, ఎజాక్, ఇర్ఫాన్, వైఎస్సార్‌సీపీ మండల ఎస్సీ సెల్ మండల మైనార్టీ అధ్యక్షులు యాసిన్‌లు చైర్‌పర్సన్ దంపతులను సన్మానించారు.



ఇది మల్లెల వేళ!

ఎమ్మిగనూరుటౌన్: వేసవి మొదలైందంటే చాలు మల్లెల సీజన్ కూడా మొదలైనట్లే. మగువల మనసు దోచుకునే మల్లెలు ప్రస్తుతం మార్కెట్‌లో గుభాళిస్తున్నాయి. పట్టణంలోని పూలదుకాణాల్లో రాశులుగా పోసి, దండలు కట్టి మల్లెలు విక్రయిస్తున్నారు. అదేవిధంగా తోపుడు బండ్లపై మల్లెల రాశులు కనువిందు చేస్తున్నాయి. సువాసనలను వెదజల్లుతూ మహిళలను ఆకర్షిస్తున్నాయి. కర్నూలు, కోడుమూరు, నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచే కాకుండా హెచ్. మురవణి, అనంతపురం తదితర ప్రాంతాల్లో సాగు చేసిన మల్లె తోటల నుంచి పట్టణానికి మల్లెలు వ్యాపారులు తెచ్చి విక్రయాలు చేస్తున్నారు. పట్టణంలోని సోమప్ప సర్కిల్ తదితర ప్రాంతాల్లో మల్లె పూలను తోపుడు బండ్లపై విక్రయాలు సైతం పెరిగిపోతున్నాయి. పూలదుకాణాల్లో, తోపుడు బండ్లపై రాశులుగా పోసి వ్యాపారం సాగిస్తున్నారు. ఈ సీజన్‌లో మల్లెలు ఎక్కువగా వస్తుండటంతో తోపుడు బండ్లపై పావు రూ.10లకే ఇస్తుండటంతో మగువలు వాటిని కొనకుండా వుండలేకపోతున్నారు. మల్లెలతో పాటు కనకాంబరాలు, గులాబీలు సైతం గుభాళిస్తున్నాయి. పెళ్లిళ్లు ఎక్కువగా వుండటంతో మల్లెలకు గిరాకీ పెరిగింది. పెళ్లి కూతుర్ల పూల జడలకు, దండలకు మంచి డిమాండ్ నెలకొంది.

ఎండీయూ వాహనాలు కొనసాగించాలి


ఆర్‌ఐ తిక్కస్వామికి వినతి పత్రం అందజేస్తున్న కోసిగి మండల ఎండీయూ ఆపరేటర్స్

కోసిగి: ప్రతి నెలా రేషన్ బియ్యం పంపిణీ ఎండీయూ ఆపరేటర్స్ ద్వారానే కొనసాగించాలని కోసిగి మండల ఎండీయూ ఆపరేటర్స్ సురేష్ స్వామి, వీరారెడ్డి, నరసింహులు, ఉపేంద్ర, ఉప్పర శివ, బాలస్వామి, బాలయేసులు కోరారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్‌ఐ తిక్కస్వామికి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ 2021 ఫిబ్రవరిలో ఈ పథకం అమలు చేస్తూ ఆరేళ్ల పాటు కొనసాగించేలా వాహనం కేటాయించి అనుమతిలిచ్చారు. ఇంకా 18 నెలల గడువు ఉన్నా ప్రస్తుత ప్రభుత్వం ఎలాంటి ఎన్‌ఓసీ ఇవ్వకుండా తొలగిస్తున్నట్లు చెప్పడం బాధకరమన్నారు.

90శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్‌కు గాను రైతులకు 90శాతం సబ్సిడీపై విత్తనాలను పంపిణీ చేయాలని ఏపీ రైతు సంఘ జిల్లా కార్యదర్శి పంపణ్ణ గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 90శాతం సబ్సిడీపై వేరుశనగ, పత్తి, మిరప, ఉల్లి విత్తనాలు రైతులకు ఇవ్వాలన్నారు. అదేవిధంగా స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేయాలని కోరారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాల విక్రయాలు జరుగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతు సమస్యలపై ఈనెల 26వ తేదీన నిర్వహించే జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నా కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు భాస్కర్ యాదవ్, రంగన్న, సమీవుల్లా, వీరేష్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి చౌకదుకాణాల నుంచే రేషన్

గోనెగండ్ల : వచ్చే నెల 1వ తేదీ నుంచి డీలర్ల షాపుల నుంచి రేషన్ పంపిణీ జరుగుతుందని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తెలిపారు. శనివారం రాత్రి మండల కేంద్రం గోనెగండ్లలోని 1వ రేషన్ షాపును సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా షాపులో నిల్వ ఉన్న బియ్యం, చక్కెర తదితర రేషన్ వస్తువులను పరిశీలించారు. రేషన్ సరఫరా సక్రమంగా జరుగుతుందా, బియ్యం నాణ్యత ఎలా ఉందని, డీలర్లు అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారా అనే వివరాలను కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు.

వేసవి ఆటవిడుపు


బొంగరాలాట ఆడుతున్న చిన్నారులు

కౌతాళం: వేసవి సెలవుల్లో పల్లె పిల్లలంతా ఒక చోట గుమికూడి తెలిసిన గ్రామీణ ఆటలు ఆడుతున్నారు. ఉన్నోళ్ల పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీల ముందు వాలిపోతే.. లేనోళ్ల పిల్లలు చెట్ల కింద దర్శన మిస్తున్నారు. బొంగరాలు, చిలకొట్టుడు, గోళీల ఆట, కబడ్డీ ఆటలు ఆడుతూ కనిపిస్తున్నారు. పల్లె ఆటలు అక్కడక్కడ జీవంతోనే ఉంటాయటానికి ఈ చిత్రం నిదర్శనం. మండల పరిధిలోని బంటకుంట గ్రామంలోని ఎస్సీ కాలనీ వద్ద చిన్నారులు ఇలా బొంగరాలాట ఆడుతూ కనిపించారు.

నాణ్యమైన భోజనం అందించాలి


క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ఆదోని టౌన్: అన్నా క్యాంటీన్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన భోజనం అందించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం ఆదోని పట్టణంలోని అన్నా క్యాంటీన్‌లను తనిఖీ చేశారు. పేదలకు వడ్డించే అల్పాహారం నాణ్యతపై పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు తప్పకుండా పాటించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్యాంటీన్‌లో అల్పాహారం పరిశీలన


అన్నా క్యాంటీన్‌లో అల్పాహారం పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ఉన్న అన్నా క్యాంటీన్‌లో అల్పాహారాన్ని శనివారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. అదేవిధంగా హెచ్‌బీఎస్ కాలనీ, కమిటీ రోడ్, గంజిళ్ల రోడ్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి ఆయా పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందికి సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని టౌన్: పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ లోకేశ్వరిని కోరారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన చైర్‌పర్సన్‌ను సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, పట్ట కమిటీ సభ్యులు వెంకటేశులు, వీరేష్, వెంకటేష్ తదితరులు సత్కరించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో మంచినీటి సమస్య పరిష్కారానికై జనాభాకు అనుగుణంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలని కోరారు. పట్టణంలో కూలడానికి సిద్ధంగా ఉన్న పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జి పునః నిర్మించాలన్నారు. అర్ధంతరంగా నిలిచిపోయిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ పనులు వెంటనే ప్రారంభించాలని, పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభుత్వమే ఉచితంగా సీటీ స్కాన్, ఎమ్మార్ఐ కేంద్రాన్ని ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.